
# కథలంటే చెవికోసుకునేవాడు

మూలం: ఈవ్లిన్ వా
అనువాదం: రామవరపు గణేశ్వరరావు



ఆ ముసలాయన పేరు టాడ్. అమెజానాస్ అటవీప్రాంతంలో అరవై ఏళ్ళుగా ఉంటున్నప్పటికీ ఒకటి రెండు దక్షిణ అమెరికన్ ఇండియన్ కుటుంబాలకి తప్ప, యింకెవరికీ అతను అక్కడుంటున్నట్టు తెలీదు. అడవికి మూడు మైళ్ళ దూరంలోని ఒక మైదానంలో – కొంతమేర ఇసుక యింకొంతమేర గడ్డిపరుచుకున్న చోట– అతని ఇల్లుంది. దట్టమైన అడవి మైదానం అన్ని వేపులా పరచుకుని ఉంది. చిన్న పశువుల మంద, అరటి, మామిడి చెట్ల తోట అతనికున్న ఆస్తి.

ఒకనాడు టాడ్‌వద్దకు ఒక ఆటవికుడు ఓ వార్త మోసుకొచ్చాడు. ఒక తెల్ల జాతి ఖనిజాన్వేషకుడు అడవిలో ఒంటరిగా తిరుగుతున్నాడు. అతను జబ్బుతో బాధపడుతున్నట్టు కనిపించాడు.

టాడ్ ఆ వ్యక్తి కోసం అడవికేసి వెళ్ళాడు. అప్పటికే ఆ వ్యక్తి అడవి బయటకు వచ్చేశాడు. అతని తలమీద టోపీ కాని, కాళ్ళకి బూట్లు కానీ లేవు. గాయాలతో పాదాలు బాగా వాచి ఉన్నాయి. అతని ఒంటిమీద బయటకు కనిపించినంతమేరా దోమలు, గబ్బిలాల కాట్ల మచ్చలు! టాడ్ పలకరించటంతో, తనలో తను చేసుకుంటున్న సంధిప్రేలాపనను ఆపాడు అతను.

''ఎంతో అలిసిపోయాను. అడుగు ముందుకు పడటం లేదు. ఇక నడవటం నా వల్ల కాదు.'' అని గొణిగాడు.

టాడ్ తన చేతిని అతనికి ఆసరాగా యిచ్చి, గడ్డి బీడుల మధ్యగా, తన యింటివేపు నెమ్మదిగా నడిపించసాగాడు.

''అయ్యా, మా ఇల్లు యిక్కడికి దగ్గర్లోనే ఉంది. మనం అక్కడకి చేరుకున్నాక మీరు కుదుటబడటానికి మందులు ఏవేనా యిస్తాను.'' అని అన్నాడు.

''అరే, మీరు ఇంగ్లీషు మాట్లాడుతున్నారే. ఈ అడవిలో యింతవరకు ఏ మానవప్రాణి కనిపించని చోట! ...నేను ఆంగ్లేయుడినే. నాపేరు లాస్ట్.'' అన్నాడతను.

''అలాగా. చాలా సంతోషం! ఇంక మీరేం చెప్ప నక్కరలేదు. బాగా అలసి ఉన్నారు. ఇక మీరు నిశ్చింతగా ఉండండి. మీ ఆరోగ్యం విషయం నేను చూసుకుంటాను.''

లాస్ట్ నెమ్మదిమీద కోలుకున్నాడు. మొదట్లో కొన్నిరోజులు సంధిప్రేలాపన తరువాత జ్వర తీవ్రత తగ్గిపోసాగింది. అయితే అంత జబ్బులోనూ, స్పృహలోనే ఉన్నాడు. టాడ్ క్రమం తప్పకుండా అతని చేత తను మూలికలతో చేసిన మందు తినిపించాడు.

''ఈ అడవిలో ప్రతీ జబ్బుకూ మందు దొరుకుతుంది.'' అంటూ టాడ్ అతనికి వివరణ యిచ్చాడు. ''మా అమ్మ అమెరికన్ ఇండియన్. ఇక్కడే పుట్టి పెరిగింది. ఆమె నాకు ఈ మూలికలను ఎలా వాడాలో నేర్పింది.''

''కాని మీరు ఆంగ్లేయులేకదా?''

''మా నాన్నది వెస్ట్ ఇండీస్. మతప్రచారకుడిగా గయానా వచ్చాడు. ఆయన పోయి ఇంకా ఇరవై ఏళ్ళు కూడా అవలేదు. ఆయన బాగా చదువుకున్నవాడు. మీకు చదవటం వచ్చా?''

''ఓ రాకేం!''

''అందరికీ ఆ అదృష్టం ఉండొద్దూ? నా మట్టుకు నాకు ఏమాత్రం చదువూ రాదు.''

లాస్ట్ ఇబ్బందిగా నవ్వాడు. ''మరి ఆ అవకాశం ఇలాటి నిర్జనారణ్యంలో ఎలా ఉంటుంది?'' అన్నాడు.

''నా దగ్గర ఎన్నో పుస్తకాలున్నాయి. వాటిని మీకు చూపిస్తాను. ఐదేళ్ళ క్రితం వరకు యిక్కడ ఒక చదువుకున్నాయన ఉండేవాడు. ప్రతి రోజూ నాకు ఏదో ఒకటి చదివి వినిపించేవాడు. మీ ఆరోగ్యం కాస్తా కుదుటపడ్డాక, అవి చదివి వినిపించుదురుగాని.'' అన్నాడు టాడ్.

''అంతకన్నా ఆనందం నాకింకేం ఉంటుంది – అలాగే చదివి వినిపిస్తాను మీకు.''

''ఔను. నాకోసం మీరు తప్పక అవి చదివి వినిపించాలి'' అని టాడ్ రెట్టించాడు.

చెప్పుకోదగ్గ విశేషాలు లేకుండా రోజులు సాఫీగా గడిచిపోసాగాయి. మొదటిసారి లాస్ట్ ఇంట్లోంచి బైటకొచ్చేక, అతన్ని టాడ్ కొంతదూరం నడిపించాడు.

''మీకు వాషింగ్‌టన్ సమాధి చూపిస్తాను.'' అంటూ మావిడితోట మధ్యలోనున్న ఒక ఎత్తయిన ప్రదేశానికి తీసుకెళ్ళాడు. ''నన్నెంతో ఆప్యాయంగా చూసేవాడు వాషింగ్‌టన్. ప్రతిసాయంత్రం – తను చనిపోయేటంతవరకు – రెండు గంటలసేపు నాకు ఏదేనా చదివి వినిపించేవాడు. నాకో మంచి ఆలోచన వచ్చింది యిప్పుడు! అతని మరణానికి మీ రాకకి చిహ్నంగా ఓ శిలువ యిక్కడ పాతుతాను.'' అని అన్నాడు టాడ్.

వరుసగా ఓ వారం రోజులు లాస్ట్‌కి జ్వరం రాలేదు. టాడ్ అది చూసి, '' ఇప్పుడు మీ ఆరోగ్యం బాగానే ఉన్నట్టుంది. ఇక మీరు నా పుస్తకాలు చూడవచ్చనుకుంటా.'' అన్నాడు.

ఇంట్లో యింకో మూల చూరుకింద ఎత్తయిన అటక ఉంది. నిచ్చెన ఆనించి టాడ్ దానిపైకి ఎక్కాడు. లాస్ట్ అతన్ని నెమ్మదిగా అనుసరించాడు. జబ్బుపడటం వలన అతని ఒంట్లో ఇంకా సత్తువ లేదు. నిచ్చెన చివరి అంచుమీద నిలబడి, అటకనంతా పరికించాడు. చిన్నచిన్న మూటలు కొన్ని గుట్టగా పోసి ఉన్నాయి – పాతగుడ్డలు, ఎండు తాటాకులు, తోలు ముక్కలతో కట్టిన మూటలు!

''వీటికి చెదలు పట్టకుండా చూడటం చాలా కష్టం. రెండిటిని అప్పుడే అవి పొట్లను పెట్టుకున్నాయి.'' అన్నాడు టాడ్. దగ్గర్లోనే ఉన్న ఒక మూటను విప్పి, అందులోంచి ఒక పాత బౌండు పుస్తకం తీశాడు – అది బ్లీక్ హవుస్ అనే నవల. మొట్టమొదటి అమెరికన్ ప్రచురణ కాపీ!


''మీకు ప్రఖ్యాత ఇంగ్లీషు నవలా రచయిత డికెన్స్ అంటే ఇష్టం అనుకుంటా!'' లాస్ట్ దానిని చూస్తునే అడిగాడు.


''ఇష్టమా అని మెల్లగా అంటారా? అంటే పడిచస్తాను. మీకు తెలుసా నాకు తెలిసిన పుస్తకాలన్నీ డికెన్స్‌వే! ఇవే మానాన్న చదివేవాడు, అతని తర్వాత వాషింగ్‌టన్... ఇప్పుడు మీరు. ఇంతవరకూ ఎన్నోసార్లు వీటిని విని ఉంటాను. అబ్బా, ఎన్ని అద్భుతమైన పాత్రలు, ఎన్ని మనోహర దృశ్యాలు, ఎన్ని రమణీయమైన పదాలు.. డికెన్సు రాసిన పుస్తకాలన్నీ నా వద్ద ఉన్నాయి. చెదలు కొట్టేసినవి తప్ప. ఇవన్నీ చదవటానికి ఎంతో సమయం కావాలి.. బహుశా రెండు సంవత్సరాలు పైనే!''

''ఔననుకుంటా!'' చిన్నగా నవ్వుతూ అన్నాడు లాస్ట్. ''సరే, నేనిక్కడ ఉన్ననాళ్లూ ముందు నా కాలక్షేపానికి పనికొస్తాయి. నేనిక్కడ ఉండే సమయం కన్నా, వాటిని చదవటానికి ఎంతో సమయం కావాలి...బహుశా రెండు సంవత్సరాలు పైనే! ''అన్నాడు. ఆ విషయాన్ని లాస్ట్ తేలికగా తీసుకుంటూ.

''ఏమో, నాకలా అనిపించటం లేదు.. మళ్లీ మొదటినుంచీ డికెన్సు నవలలు చదవటం సరదాగా ఉంటుంది. ప్రతీసారి వాటిలో మళ్లీ మళ్లీ మెచ్చుకోదగ్గ అంశాలు చాలా దొరుకుతుంటాయి నాకు!'' అని టాడ్ అన్నాడు.

ఆనాటి సాయంత్రం లాస్ట్ చదవటం మొదలె






ట్టాడు. బయటకి గట్టిగా చదవటం అంటే ఆయనకీ యిష్టమే!

లాస్ట్‌కి ఎదురుగా ముసలాయన కూర్చుని అతను చదివే పదాల్ని నిశ్శబ్దంగా పెదాలతో అంటూ అనుసరించసాగాడు. ఎప్పుడేనా ఒక కొత్తపాత్ర కథ మధ్యలో ప్రవేశిస్తే, ప్రశ్నలు వేసేవాడు. ''ఏదీ మళ్ళీ మరోసారి ఆ పేరు చెప్పండి. జ్ఞాపకం ఉంచుకుంటాను.'' అనో లేకపోతే, ''ఔనౌను. నాకు ఆ పాత్ర జ్ఞాపకం ఉంది. పాపం. చివర్లో ఆమె చనిపోతుంది.'' అని అనేవాడు.

మొదటిరోజు లాస్ట్ చదవటం పూర్తి చేసాక, టాడ్ ''మీరు చాలా చక్కగా చదివి వినిపించారు. మా నాన్నే మళ్ళీ నాకు ఎదురుగా ఇక్కడ కూర్చున్నట్లనిపించింది.'' అన్నాడు.

ప్రతీసారి లాస్ట్ చదవటం అయాక, ఆ ముసలాయన తన అతిథికి మర్యాదపూర్వకంగా ధన్యవాదాలు తెలిపేవాడు. ''ఇవాళ చదివిన కథలోని ఆ భాగం నాకెంతో నచ్చింది. మొత్తం అధ్యాయం అంతా దిగులు పుట్టించేదిగా ఉంది. అయితే నాకు జ్ఞాపకం ఉన్నంత వరకు, కథ చివర్లో సుఖాంతం అవుతుంది.'' అని అన్నాడు.

ఒకనాడు బ్లీక్ హవుస్ నవలలోని పేజీలు తిప్పుతూ లాస్ట్ – ''చదవాల్సింది యింకా చాలా ఉంది. నేనిక్కడ నుంచి వెళ్ళిపోయేలోగా వాటిని చదవటం పూర్తవుతుందని అనుకోను..'' అన్నాడు.

ముసలాయన లాస్ట్‌ను అదోలా చూసాడు. ''నాకింకా యిలా చదువుకుంటూ పోవాలనే వుంది కానీ ఈ అడవిలో యింకా ఎంతకాలం ఉండగలను? మళ్ళీ నేను వెనక్కి నాగరికత ఉన్న సమాజానికి వెళ్లాల్సిన విషయం గురించి ఆలోచించవలసిన సమయం వచ్చింది... మీ ఆతిథ్యాన్ని అతిగానే తీసుకుని, మీకు యిబ్బంది కలిగించాను.'' అన్నాడు లాస్ట్.

టాడ్ ఈసారి కూడా ఏం మాట్లాడలేదు.

''నాకో పడవ కావాలి – నది దాటటానికి. అది దొరకటానికి ఎంత టైము పడుతుందంటారు? మీ ఆతిథ్యం మరువరానిది. మీరు చూపించిన ఆదరణ మాటల్లో కృతజ్ఞత చూపలేను.. నేనింక వెనక్కి వెళ్ళక తప్పదు.'' అన్నాడు లాస్ట్.

''నా ఆతిథ్యానికి బదులుగా అంతకన్నా ఎక్కువగానే – నాకోసం పుస్తకాలు చదివి మీరు రుణం తీర్చుకున్నారు. దయచేసి మళ్ళీ ఆ విషయం ఎత్తకండి.'' అని దృఢంగా అన్నాడు టాడ్.

''అయ్యా. తమరు నన్ను క్షమించాలి. తక్షణం నేనిక్కడనుంచి బయటపడాలి.. నాకో పడవ ఎప్పుడు దొరుకుతుంది? దానిని చూసిపెట్టరూ?''

''ఇక్కడ పడవలు లేవు.'' నిర్లిప్తంగా అన్నాడు టాడ్.

''పోనీ.. మీ దగ్గరకు అప్పుడప్పుడు వస్తున్న ఆటవికుల చేత పడవ తయారు చేయించరాదా?''

''వానాకాలం వచ్చేవరకు మీరు ఆగాలి. ఇప్పుడు నదిలో నిండుగా నీళ్లుండవు.''

''వానలెప్పుడొస్తాయ్?''

''ఒకటి రెండు నెలల్లో!''

వాళ్లిద్దరూ బ్లీక్‌హవుస్ నవల పూర్తి చేసారు. ఇంకోనవల డోంబే అండ్ సన్స్ ముగుస్తుందనగా వానలు మొదలయాయి.

''ఇక నేను బయలుదేరటానికి ఏర్పాట్లు చేయరూ?'' అన్నాడు లాస్ట్.

''ఇప్పుడా? అసంభవం! వర్షాలు పడుతున్నంతకాలం యిక్కడివారు పడవ తయారీపని ముట్టుకోరు. ఇక్కడి వారికదో మూఢ నమ్మకం. ఈ విషయం యింతకు ముందు మీతో నేను అనలేదా?.. సరే, మీ భోజనం పూర్తయాక, నవలలోని చివర అధ్యాయం మొదలుపెడుదురుగాని!''

ఇంకొన్ని వారాలు గడిచిపోయాయి. నికొలస్ నికెల్‌బై చదివారు. లిటిల్‌డోరిట్ పూర్తయింది. ఆలివర్ ట్విస్ట్ ముగించారు. లాస్ట్ ఇంగ్లండు వదిలి ఒక సంవత్సరం అయిపోతుండగా, ఒకనాడు ఒక వర్తకుడు వాళ్ళున్న ప్రదేశం చేరుకున్నాడు. అలా ఆ అడవులన్నీ చుట్టిరావటం అతని వృత్తి. లాస్ట్ ఓ కాగితం ముక్క మీద తన పేరు, వివరాలు, అది ఎక్కడికి చేరాలో ఆ చిరునామా రాసి అతడి చేతిలో ఉంచాడు. ఈ సంవత్సరంగాని వచ్చే సంవత్సరంగాని అతగాడు బ్రెజిల్ చేరుకుంటాడు. ఈలోగా లాస్ట్ ఎంతో ఆశతో, ఆత్మవిశ్వాసంతో తన నిత్యకృత్యాలలో పడ్డాడు.

ఒక సాయంత్రం టాడ్ చాలాసేపు తనకు తెలిసిన స్థానిక ఆటవీకులతో మాట్లాడాక, లాస్ట్‌తో అన్నాడు. ''వీళ్ళంతా యివాళ రాత్రి పండుగ చేసుకుంటున్నారు. మనల్ని పిలవటానికి వచ్చారు. సంవత్సరానికో రోజు ఈ జాతర. వెళ్దాం పదండి.'' అని అతన్ని లేవదీసాడు.

ఆనాటి రాత్రి వాళ్ళతో విందు భోజనం. మైదానానికి ఆవలివైపు గూడెంలో మధ్యగా పెద్ద మంట పెట్టారు. చుట్టూ చాలామంది ఆటవికులు వారి వారి కుటుంబాలతో కూర్చున్నారు. అందరూ మధ్యమధ్య ఏదో పానీయం తాగుతూ ఏదోపాటను ఒకే రకంగా కలిసి పాడుతున్నారు. టాడ్‌కు, అతని అతిథి లాస్ట్‌కు తాగటానికి రెండు దొన్నెలు యిచ్చారు.

''దొన్నెని కింద పెట్టకుండా, అందులోదంతా ఒక గుక్కలో తాగేయాలి. అది వీళ్ళ ఆచారం.'' అని టాడ్ తన అతిథితో అన్నాడు.

లాస్ట్ అతను చెప్పినట్లే దొన్నెలోని చిక్కని సారాయాన్ని గొంతులోకి పోసుకున్నాడు. తేనె, గోధుమ రొట్టెలు రెండూ కలిసిన రుచి! దాన్ని తాగాక సంతృప్తిగా వెనక్కివాలాడు. అతని చేతికి మళ్ళీ మరో దొన్నె అందించారు. దానిని కూడా ఖాళీ చేశాడు లాస్ట్. పూర్తిగా వెనక్కివాలి, ఆ స్థానికులు లయబద్ధంగా నాట్యం చేస్తుంటే, మంట వెలుగులో గడ్డి మీద పరచుకున్న వారి నీడల విన్యాసాలని చూస్తూ, టాడ్ అందిస్తున్న మద్యం దొన్నెలని ఖాళీ

చేయసాగాడు. కొంతసేపటికి అతనికి తెలీకుండానే, అతని కళ్లు వాటంతటవే మూతలు పడ్డాయి. ఇంగ్లండ్ గురించి అక్కడ ఉన్న తన భార్య గురించి ఆలోచిస్తూ అలా నిద్రలోకి జారిపోయాడు.

లాస్ట్‌కి మెలుకువ వచ్చింది. ఇంకా అతను గూడెంలో గడ్డిపైనే ఉన్నాడు. చుట్టుపక్కలా ఎవరూ లేరు. రోజూ తను నిద్ర లేచే సమయం దాటినట్లుంది. టైము ఎంతయి ఉంటుందో అని, తన చేతి వాచీ చూశాడు. తన చేతికి అది లేకపోవడంతో ఆశ్చర్యపోయాడు.

టాడ్ ఇంటివేపు నడుస్తూ అతను మార్గమధ్యంలో అనేక సార్లు ఆగవలసివచ్చింది. ఇంకా ఒళ్లంతా మత్తుగానే ఉంది..కళ్లు మూసుకుని బరువుగా ఊపిరితీసుకున్నాడు.

''ఇదెక్కడి డ్రింకు..ఘోరంగా ఉంది!'' అని లాస్ట్ అనుకున్నాడు. ఇల్లు చేరుకున్నాక బయటే కూర్చున్న టాడ్ అతన్ని పలకరించాడు.

''ఇవాళ పుస్తకం చదవటానికి మీరు ఆలస్యంగా చేరుకున్నారే! ఇంకో అరగంటకన్నా వెలుతురు ఉండదు.. ఇంతకీ ఎలా ఉంది మీ ఒంట్లో?''

''ఘోరంగా ఉంది.. వాళ్లు పోసిన తాగుడు నా ఒంటికి పడినట్లు లేదు!''

''సరే. మీకు స్వస్థత చేకూరడం కోసం మందిస్తాను.''

''నా వాచీని మీరెక్కడేనా చూశారా? నా చేతికి నిన్న పెట్టుకున్నాననే అనుకున్నాను....కనిపించటం లేదు.. ఇంతసేపు నేనెప్పుడూ నిద్రపోలేదు!''

''రెండు రోజులు.''

''అసంభవం..రెండురోజులా? అంత సేపు నిద్రపోయి ఉండను.''

''లేదు. నిజంగానే మీరు రెండు రోజులు నిద్రలో ఉన్నారు.. దురదృష్టం ఏమిటంటే, మన అతిథులను మీరు కలుసుకోలేకపోయారు!''


''అతిథులా?''

''ఔను. ముగ్గురు ఇంగ్లీషు వాళ్లు, మీ దేశస్థులు... కేవలం మిమ్మల్ని కలుసుకోటానికే..మీకోసమే.. ఇంత దూరం వచ్చారు కాని, నేనేం చేయగలను? మీరేమో గాఢ నిద్రలో ఉన్నారాయె! సరే, వాళ్లని పలకరించే స్థితిలో మీరు ఎలాగూ లేరు కదాని నేనే వారికో జ్ఞాపికను అందజేసాను. అదే మీ వాచీ. మీకు సంబంధించిన వస్తువేదేనా మీ ఆవిడ కోసం తీసుకెళ్దామనుకున్నారు వారు. మీ గురించి సమాచారం తెచ్చినవారికి పెద్ద బహుమానం యిస్తానని మీ ఆవిడ ప్రకటించిందట! అందుకే వాళ్లు మీ రాకకు గుర్తుగా సమాధిపై నేను పాతిన శిలువకు ఫోటోలు కూడా తీశారు.

''మళ్లీ వాళ్లు... ఇంకెవరేనా కాని..యిటుకేసి వస్తారని అనుకోను. ఇక్కడ మన జీవితాలు హాయిగా, విశ్రాంతితో, ప్రశాంతంగా గడిచిపోతున్నాయి...అసలు మళ్ళీ మనకోసం అతిథులెవరూ ఈ ప్రాంతాలకి వస్తారని అనిపించటం లేదు.. సరే, మీరు కొంచెం తెరిపిన పడటానికి, మీకో మందిస్తాను. ఇవ్వాళ్టికి మనం డికెన్సుని వదిలేద్దాం. కాని రేపు లిటిల్ డోరిట్ చదువుదాం... ఆ నవలలో కొన్ని భాగాలున్నాయి చూశారూ..వాటిని వింటున్నప్పుడు కళ్ళంట నీళ్ళు తన్నుకొస్తుంటాయి. నేను ఏడుపు ఆపుకోలేకపోతుంటాను.'' అన్నాడు ఆ ముసలాయన.

★

# కెబిసి 'బిగ్' హీరో షారూఖ్



కౌన్‌బనేగా కరోర్ పతి కొందరిని లక్షాధికారులను, మరి కొద్దిమందిని కోటీశ్వరుల్ని చేయడంతో పాటు 'స్టార్ ఇమేజ్'ని కూడా తీసుకొచ్చింది. ఎవర్ని కోటీశ్వరులను చేసినా చేయకపోయినా బిగ్‌బి అమితాబ్‌ని అందనంత ఎత్తులో నిలబెట్టింది. కష్టాల్లో వున్న అమితాబ్ మీద కనకవర్షం కురిపించింది అంటారు (నిజంగా జరిగింది కూడా అదే...) రెండు సంవత్సరాలు అప్రతిహతంగా కొనసాగిన ఈ కార్యక్రమం నుంచి అమితాబ్ తప్పుకొన్నాడు. కారణాలు చెప్పుకోవడం అప్రస్తుతం. ఆయన స్థానంలో వచ్చిన షారూఖ్ ఖాన్ మీద ముందు నుంచి వాదోపవాదాలు, తర్జనభర్జనలు జరిగాయి. బిగ్‌బి తో షారూఖ్ పోటీ పడగలడా? అని చాలా మంది అనుమానపడ్డారు కూడా... పడలేడేమో అన్న అనుమానం నిర్వాహకుల్లో కూడా ఏ మూలో పొడసూపింది. అందరి అంచనాలు తారుమారు చేస్తూ షారూఖ్ విజయఢంకా మోగిస్తున్నాడు. తనను వేరొకరితో పోల్చే అవకాశాన్ని విశ్లేషకులకు ఇవ్వడంలేదు. వారి చేతికి చిక్కకుండా టీవీ ప్రేక్షకుల చేత శభాష్ అనిపించుకోవడమే కాదు... వచ్చేవారం వరకూ వెయిట్ చేయిస్తున్నాడు... ఏమైతేనేం డ్రెస్ విషయంలోను... సంభాషణా చాతుర్యంలోనూ తనకంటూ ఓ స్టయిల్‌ను సృష్టించుకొని ముందుకి సాగిపోతున్నాడు. ప్రారంభంలో స్టార్టింగ్ ట్రబుల్ ఎదుర్కొన్నా తికమక పడకుండా హాట్ సీట్‌లో కూర్చున్న వ్యక్తికి చెమటలు పట్టించే కార్యక్రమంలో ముందుకు దూసుకుపోతున్నాడు షారూక్. లైవ్ చూడడానికి వచ్చిన ప్రేక్షక మహాశయులకు అభివాదం చేయడం దగ్గర నుంచి హాట్ సీట్లో కూర్చున్న వారిని పరిచయం చేసుకొని కార్యక్రమం కొనసాగించడం వరకూ తనదైన బాణీని సృష్టించి 'కౌన్ బనేగా కరోర్ పతి' అంటే బిగ్‌బిని మరిచిపోయే స్థాయికి షారూఖ్ వెళ్లిపోయాడు. కార్యక్రమం చివర్లో బిగ్‌బి ఒక పెద్ద నిట్టూర్పు విడిచి 'టైమ్స్ అప్' అంటూ సెలవు తీసుకుంటే షారూఖ్ మాత్రం కొంచెం హాస్యం జోడించి 'ఇంటి నుంచి నా భార్య పిలుస్తోంది' అంటూ చమత్కారంగా కార్యక్రమాన్ని ముగిస్తున్నాడు. వారం తరువాత తిరిగి సోమవారం ప్రేక్షకులు కెబిసి చూస్తారా? అన్న అనుమానం తొలుత నిర్వాహకులు వ్యక్తం చేసినా చివరికి వారే వచ్చేవారం ఏం జరుగుతుందా? అన్న ఉత్సుకతతో ఎదురు చూసే పరిస్థితులు నెలకొన్నాయి అంటే షారూఖ్ కెబిసి బిగ్ హిట్ కాక మరేమిటి? కేవలం నిర్వాహకులు మాత్రమే కాదు క్విజ్ నిర్వహణలో హేమాహేమీలుగా పేరుతెచ్చుకున్న శేఖర్ సుమన్, సిద్ధార్థబసు లాంటి ఉద్దండులు సైతం షారూఖ్ నిర్వహణా పటిమను మెచ్చుకోకుండా వుండలేకపోతున్నారు. కేవలం మాట చాతుర్యమే కాకుండా డ్రెస్ విషయంలో కూడా షారూఖ్ ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటూ అసలు వయసు కంటే పది సంవత్సరాలు చిన్నగా కనపడుతూ కుర్ర హీరోల గుండెల్లో గుబులు రేపుతున్నాడు. తన మీద అమితాబ్ ఛాయలు ఏమాత్రం పడకుండా తనదైన శైలిలో ఆడియన్స్‌కి షేక్‌హ్యాండ్స్ ఇచ్చి మొదటి షోలోనే తనేమిటో... తన స్టయిల్ ఏమిటో నిరూపించుకొన్నాడు.